మినీ కథ

# వాన (కి) పాము కరిచింది

వంగర లక్ష్మీకాంత్

అల్లుడు గారు వస్తున్నారంటే అరవైయేళ్ల మామగారి గుండెల్లో రైళ్ల పరుగు. నీళ్ల(ల్లో) పాము ఏదో కరిచిందని పదిరోజుల సెలవుపై వాలిపోయాడు. నీళ్ళ పామో ! వాన(కి) పామో ! అదెందుకు కరవాలి? మామపానాలు తోడటానికి కాకపోతే ?

అదేంటో గాని అన్నేసి రోజులు అంటుకు పోవటం కూడా ఒక కళే. పండుగ రోజుల్లో అయితే అబ్బ ఆ పార్స్ చూడాల్సిందే గాని చెప్పనలవిగాదు. అంత లా(వు) పెద్దమనిషి వంటగదిలో ఇట్టె దూరిపోయి ఒకటే కబుర్లు. ఏ కూరలో ఏమి కలిపితే రుచిగా ఉంటుందో దగ్గర నుంచి ఏ పచ్చడి ఎలా పెట్టాలో తన రుచుల చిట్టా విప్పాడంటే ఆడాళ్ళంతా చెవులప్పగించి బొమ్మల్లా నిలబడి పోవాల్సిందే. తనేది తలచాడో క్షణాల్లో ప్లేటులో ప్రత్యక్షమే. ఆయనుంటే నవ్వుల పంటే.

వర్షం వచ్చిందంటే కాలు బయటపెట్టడు. అయినా తీరికెక్కడిదిలే! వంటగది సలహాలతోనే పొద్దెల్లిపోద్ది. ఏ పత్రికయినా సాహసించి "నలభీమపాకం" అనే శీర్షికపెట్టి ఒక పేజీ కేటాయిస్తే చాలు హాట్‌కేకుల్లా (క్షణాల్లో) కొనుక్కుపోగలరు. ఆc.....మరేమనుకున్నారూ ! కాని ఆ మామగారికి మాత్రం... చెప్పేదేముందిలెండి ! ఈ వయస్సులో సీనియర్ సిటిజన్‌గా గౌరవం పొందాల్సింది పోయి జీవనపోరాటంలో సూర్యుడితో పోటీపడి పరిగెత్తాల్సిందే !

ముచ్చటగా ముగ్గురు పిల్లలు. వెరసి ఐదుగురు. రెక్కలకష్టంమీది పెంచి పెద్ద చేసినా..చదివించినా...కొలువులు కుదిరినా..ఏం తప్పింది?

బిడ్డలు అందలం ఎక్కినా, ఊళ్లేలినా ఎవరి బ్రతుకు వారిదే. సత్తువున్నంత దాకా రెక్కలు ముక్కలు చేసుకోవాల్సిందే. చివరి రక్తంబొట్టు వరకు చెమట చుక్కగా మారాల్సిందే. ఆ ప్రక్రియ ఆగిందో ఆ కట్టె పుడకల్లో (పుల్లల్లో) పెట్టాల్సిందే. అలా ఆలోచనా సుడిగుండంలో కొట్టుకు పోతూ ఇంటికి చేరాడు.

అప్పటికే నట్టింట్లో పచ్చి బాలింతలా పట్టిమంచం మీద అల్లుడుగారు. అంతే అవాక్కయ్యాడు.

"ఏమిటి? ఉలుకడు. పలుకడు" అనుకుంటూ ఎగాదిగా చూశాడు..తనే "మామగారూ ! బాగున్నారా?" అంటూ అప్యాయంగా పలకరించాడు.

"ఆ..... బాగానే ఉన్నా....." అనగలిగాడు.

అయినా మనిషికేం బాగానే ఉన్నాడుగా. కట్టెలా గట్టిగా. నీరు బడితే ఒట్టు. కాని మనసుకేదో నాగుపాము కుట్టినట్టుంది.

" మీ అల్లుడిగారికి వానాకాలం అంటే మా చెడ్డ చిరాకు నాన్నగారూ. కాలు కదపాలంటే చీదర.... భయం.... మొన్నేం జరిగిందో తెలుసా! నీళ్ళల్లో నుంచి వెళ్లాల్సి వచ్చిందట. భయం భయంగానే కాలేశాడు. అయినా నీళ్ల(ల్లో) పామేదో కసుక్కున కరిచేసింది. కాలంతా ఒకటే పోట్లంట. యింత లావయ్యింది. మూలుగుతూ ఇంటికి వచ్చాడు."

"అదేం చేస్తుందిలే. తగ్గుతుంది లెమ్మంటే మీ అమ్మాయి ఊరుకుంటేనా మాంగారూ !"

"నాన్నా ! ఆయన నోటెంట ఒకటే నురుగు... తెమడ.... మెలికలు తిరిగిపోయారనుకో. నాకైతే భయమేసింది. అప్పటినుంచి ఒకటే కలవరింత మాంగారు ఏం చేస్తున్నారో ? ఎక్కడ తిరుగుతున్నారో ? ఏం పాడో ఎక్కడ చూసినా వాన (కి) పాము లేనాయె !"

"అందుకే చూసి పోదామని వచ్చాం" ఒకరికి ఒకరు పోటీపడి గుక్క తిప్పుకోకుండా చెప్పేశారు.

చెట్టంత మనిషి ! పిట్టంతయిపోయాడు ! పాము కాటంటే మాటలా. అదే విసం పురుగైతే ఏం గాను !

"అల్లుడుగారూ! అదేదో ఫుల్ బూటు మోకాలుదాకా వేస్తారటగా?"

"అయ్యో.... వేసానండి మామయ్యగారూ. అయినా దాని దుంపతెగ...... పైకి పాకి మరీ కుట్టినట్టుందండి."

"అయ్యో... అల్లుడుగారూ !"

ఇక అత్తగారికి ఒకటే పని అందులోనూ అల్లుడు గారు వచ్చారంటే మాటలా ? విడిరోజుల్లో అయితే ఆమెకు అంత పని ఉండకపోను. అంత దగ్గరుండి స్వయంగా జరిపించుకునే మంచి మనసు మారాజు. కాని ఎంత కష్టమొచ్చి పడిందో చూశారూ ! ఏం చేస్తాం !

ఆ పూట పండటానికి పనికి వస్తుందని కుక్కిమంచం మూలుంటే తేవటానికి వెళ్లాడు. అంతా చీకటి. కాలికి ఏదో మెత్తగా తగిలింది. చేత్తో చూసేసరికి చుట్టేసింది. చచ్చాన్రో బాబో అంటూ అరిచాడు.

"మామగారు జాగ్రత్త. అసలే వానాకాలం. పాములుంటాయి." మీరు మంచం దిగొద్దండి. డాక్టరుగారు కదలొద్దన్నాడు " అంటూ భర్తకు జాగ్రత్తలు చెబుతూ సోకాలు పెడుతుంది కూతురు.

తాతా....తాతా.. అంటూ పాక్కుంటూ వచ్చిన పక్కింటి పిల్లగాడు "తాత కాళ్లకు తాడేంటి" అంటూ పాము తల పట్టుకుని లాగేశాడు. స్పృహతప్పి పడున్న ముసలోడి ముఖాన కాసిని నీళ్ళు కొట్టి విలవిల్లాడి పోయింది ముసలమ్మ. ఆయన గురించి గొప్పగా చెప్పేవారే గాని హాస్పిటల్‌కి తీసుకు వెళ్లటానికి ఎవరూ ముందుకు రావటం లేదు.